## క్లుప్తంగా

### మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లోని అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు కుంచే రాజా, బిత్రా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనప రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బల్లల పండగ



ఏలేశ్వరంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్, రజకులు

ఏలేశ్వరం: రజకులు భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బల్లలపండగను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెం రజకసంఘం ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. సంఘ అధ్యక్షుడు అంజూరిరాజారావు ఆధ్వర్యంలో బాజాభజంత్రీలు, మేళతాళాలు, రికార్డింగ్ డ్యాన్స్, బాణసంచా కాల్పుల నడుమ స్వామి, అమ్మవార్లను పట్టణంలో ఊరేగించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ శివపార్వతులను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, సంఘనాయకులు పాల్గొన్నారు.

### విస్తృతంగా ఎస్ఈబీ దాడులు



సారా తయారీదారుడిని అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ అధికారులు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో సారా తయారీ కేంద్రాలపై గురువారం స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ పి.అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, పది లీటర్ల నాటు స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారిలో గ్రామానికి చెందిన రామోజీ కన్నారావును అదుపులోకి తీసుకున్నారు. శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామానికి చెందిన మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు.

### టీడీపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

- జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా



తుని: టీడీపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా అన్నారు. గురువారం తునిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ఓనమాలు తెలియని నారా లోకేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న వ్యాఖ్యలతో టీడీపీకి ఉన్న కాస్త గౌరవం పోతుందన్నారు. ప్రస్తుతం టీడీపీని ప్రజలు చీదరించుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నారా లోకేష్ అవగాహన రాహిత్యంతో కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు చంద్రబాబు నాయుడు పుస్తక ప్రచురణతో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. టీడీపీ హయాంలో జరిగిన దురాగతాలను ప్రచురించాలంటే వందల పుస్తకాలు సరిపోవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రజలను తమ వైపు తిప్పుకోవడానికి ఆడుతున్న డ్రామాలను జనం గమనిస్తున్నారన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు.

### జ్యోతుల నవీన్‌పై పోలీసులకు ఫిర్యాదు

జగ్గంపేట: కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందుకు గురువారం జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎంపీడీఓ బి. హరికృష్ణ తెలిపారు. జగ్గంపేట బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని బుధవారం రాత్రి జ్యోతుల నవీన్ కుమార్ ఆవిష్కరించారని, ఇది ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఈ కారణంగా జగ్గంపేట పోలిసు స్టేషన్లో ఎస్సై విద్యాసాగర్‌కు ఫిర్యాదు చేసామని తెలిపారు.

### అరుణాచల క్షేత్రంలో ద్వారక లింగ దర్శనం

ప్రత్తిపాడు రూరల్: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ద్వారక లింగ దర్శనం ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ మేరకు నర్మద తీరం నుంచి తీసుకువచ్చిన శివలింగాలను శనివారం ఆలయ ప్రాంగాణంలో ప్రతిష్టిస్తామని చెప్పారు.



తునిలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివలింగాన్ని ప్రారంభిస్తున్న ఏపీపీ సునీత



ఏలేశ్వరంలో శివలింగం ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, చలమయ్య దంపతులు



ఎస్.అన్నవరంలో రుద్రాక్ష శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామి కల్యాణం

# చూసిన కనులకు వైభోగం

- కన్నులపండువగా స్వామివార్ల కల్యాణాలు
- వీక్షించి తరించిన భక్తులు

గండేపల్లి: మండలంలోని మురారిలో వేంచేసిన పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. రాత్రి 7 గంటల నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలు స్వీకరించారు.

**ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం**

కిర్లంపూడి: శృంగరాయునిపాలెంలో వేంచేసిన భద్రాద్రి రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ పునర్నిర్మాణ కర్త బావిశెట్టి గణపతి దంపతుల ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

**సప్తాహ మహోత్సవం**

జగపతినగరం రామాలయంలో గురువారం సప్త సప్తాహ మహోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు 49 రోజుల పాటు రామాలయంలో భజనలు చేస్తారని సప్తాహ నిర్వాహకులు తెలిపారు.



మురారిలో రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

**భక్తిశ్రద్ధలతో రుద్రాక్ష శివలింగ దర్శనం**

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు వాణీ అపార్టుమెంట్‌లో గురువారం బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన రుద్రాక్ష శివలింగాన్ని పలువురు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రుద్రాక్ష శివలింగ ప్రదర్శనను పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునిత ప్రారంభించారు. ఈ నెల 22 వరకూ భక్తులు దర్శించుకోవచ్చని బ్రహ్మకుమారీస్ తునిశాఖ ఇన్‌చార్జ్ మాధవీలత తెలిపారు. వాసవీ, టి.శ్రీరామూర్తి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, జోగారావు, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తిస్వామి, న్యాయవాది ఎంవీ సూర్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా శివలింగం ప్రతిష్ఠ**

ఏలేశ్వరం: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఏలేరునది ఒడ్డున గురువారం శివలింగం ప్రతిష్ఠించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు స్థానిక బ్రాహ్మణరేవు వద్ద శివలింగాన్ని ప్రతిష్ఠించారు. పురోహితుడు శ్రీకాంత్ శాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అలమండ వీరరాఘవస్వామి, పైల శ్రీధర్, గెద్దం కిరణ్, గూనాపు అప్పలరాజు, బాలి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

**భక్తులను అలరించిన శివలింగం**

తుని: మహాశివరాత్రి సందర్భంగా స్థానిక దివాణం వీధిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం భక్తులను అలరించింది. గురువారం ఏపీపీ సునీత శివలింగ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయంలో భక్తులను దర్శనానికి అనుమతిస్తామని బ్రహ్మకుమారి మాధవీలత తెలిపారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బ్రహ్మకుమారి వాసవి, టి.శ్రీరామ్మూర్తి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, జోగారావు, డాక్టర్ కోటిబాబు పాల్గొన్నారు. అలాగే స్థానిక జీఎస్టీ రోడ్డు వాణి అపార్ట్‌మెంటులో ఏర్పాటు చేసిన రుద్రాక్ష శివలింగాన్ని బ్రహ్మకుమారీ మాధవిలత ప్రారంభించారు.

**ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామి కల్యాణం**

ప్రత్తిపాడు: గ్రామంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామివారి పంచాయతన క్షేత్రంలో గురువారం రాత్రి విశ్వేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో పురోహితులు విఘ్నేశ్వర పూజతో కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. పుణ్యాహవచనం, పంచగ్రవ్యప్రాసన, అస్త్ర రాజార్చన, అంకురారోపణ, వాస్తు పూజ, ధ్వజారోహణం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శిష్టా కామేశ్వర శ్రీనివాస్, హరి ప్రియాంక దంపతులతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. వందలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

### తాగునీటి సమస్యకు పరిష్కారం



శంఖవరంలో నూతన పైప్‌లైన్ వేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: స్థానిక మధ్య వీధిలో గత కొంత కాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను ఎట్టకేలకు అధికారులు పరిష్కరించారు. ఈ ప్రాంతంలో పంచాయతీ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదు. స్థానికులు సమస్యను సర్పంచ్ బందిలి గనియమ్మ, కార్యదర్శి సీహెచ్ రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: పట్టణంలో విద్యుత్ లైన్లు, ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వీరవీరపుపేట 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు, డబుల్ జంపరింగ్ పనుల కారణంగా వీరవరపుపేట, పరదేశమ్మ లే అవుట్, కొత్త సూరవరం, కొబ్బరితోట, గవరపేట, ఇసకలపేట, పాత బజారువీధి, ఆర్‌కే కాలనీ, ఉప్పరగుడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని ఆయన కోరారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పైడికొండలో గౌరీ రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: మండలంలోని పైడికొండలో నూతనంగా నిర్మించిన గౌరీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో సుమారు రూ.కోటితో ఆలయం నిర్మించారు. తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ పర్యవేక్షణలో రుత్వికులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేసి రామలింగేశ్వరస్వామి, వినాయకుడు, గౌరీదేవి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పలు హోమాలు నిర్వహించారు. మంత్రి రాజా ప్రధానాలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. గతంలో ఆలయ నిర్మాణ నిమిత్తం మంత్రి దాడిశెట్టి రాజా సొంత నిధులు రూ.3 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, మంత్రి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొయ్యా మురళీ, గాబు రాజు, పైడికొండ సర్పంచ్ నరిశే నాగదేవి, నరిశే వీరాస్వామి(తాతీలు), మేడిశెట్టి దొరబాబు, ఎంపీటీసీ జెక్కా అమ్మాజీ పాల్గొన్నారు.



పైడికొండలో రూ.కోటితో నిర్మించిన రామలింగేశ్వరస్వామి ఆలయం

## పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



జె.అన్నవరం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా గురువారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక ఏలేరునది బ్రాహ్మణ రేవు వద్ద జరుగుతున్న ఆధునీకీకరణ పనులను వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలంలోని రమణయ్యపేట కొండ రాజులబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జె.అన్నవరంలో 40 అడుగుల అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సిరిపురం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

### పుష్కరిణి ప్రారంభోత్సవానికి రాట ముహూర్తం



పుష్కరిణి మహోత్సవానికి రాటపూజ చేస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవారి పుష్కరిణి ప్రారంభ మహోత్సవానికి గురువారం పందిరి రాట వేశారు. దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు, ధర్మకర్తలు ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట ముహూర్తం చేశారు. మహాలక్ష్మి అమ్మవారు, పాండురంగస్వామి, వరాహ స్వామి, హయగ్రీవ, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాలను రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా మార్చి 1న ప్రతిష్ఠించి, శ్రీవారి పుష్కరిణి ప్రారంభిస్తారని చైర్మన్ తెలిపారు. ఈ నెల 24 నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### 39 మందికి కంటి ఆపరేషన్లు

కాకినాడ: స్థానిక జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సుమారు 39 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14న అన్నమ్మఘాటీ పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించగా 39 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. వీరందరికీ పిఠాపురంలోని సీఎంసీ కంటి ఆస్పత్రిలో విజయవంతంగా ఆపరేషన్లు చేయించినట్టు ఉదయ్‌కుమార్ చెప్పారు. కంటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచించారు.

## కనకదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరి తొలి పాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా గురువారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్ ఘనపాఠి, గంగాధరబట్ల శర్మ, ప్రయాగ రాంబాబు, నర్సింహమూర్తి, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 12 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

**నేడు వనదుర్గ అమ్మవారికి చండీహోమం**

రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

## పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

అన్నవరం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పిఠాపురం డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి డి.సుభద్ర ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయుల పనితీరు, నాడు–నేడు పనులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆమె వెంట హైస్కూల్ హెచ్‌ఎం ఏఎస్ సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయుడు ప్రసాద్ ఉన్నారు.



పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న విద్యాశాఖాధికారి సుభద్ర

## పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్

ప్రత్తిపాడు: స్థానిక గ్రామ పంచాయతీకి రావలసిన పన్నుల వసూలుకు గురువారం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామాల్లో పన్నుల వసూలు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ప్రత్తిపాడు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఇంటి పన్ను, కుళాయి పన్ను, పంచాయతీ షాపుల అద్దె తదితర బకాయిలను ఉన్నవారికి డిమాండ్ నోటీసులను అందజేసింది. ప్రజలు త్వరితగతిన పన్నుల బకాయిలు చెల్లించాలని ఈఓపీఆర్డీ కేవీవీ కాశీ విశ్వనాథం కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ద్విభాష్యం శ్రీనివాసరావు, బి.కామరాజు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

## ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించేనా ?

- వారం రోజులుగా సాగుతున్న పనులు
- అధికారుల తీరుపై అనుమానాలు
- నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు

ఏలేశ్వరం: పట్టణంలోని వారం రోజులుగా ఆక్రమణల తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాగా అధికారులు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తారా ? లేదా ? అనేది ఉత్కంఠగా మారింది. ఏజెన్సీకి ముఖద్వారంతో పాటు మండలకేంద్రం కావడంతో ఏలేశ్వరంలో జనాభా గణనీయంగా పెరగింది. దీంతో ప్రధాన రహదారులపై నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటోంది. గత జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 32 వేల కాగా ప్రస్తుతం 45 వేలకు పైనే జనాభా ఉంటారని అంచనా. పట్టణం పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యి ఐదేళ్లు పైనే అయ్యింది. అప్పటి నుంచి పట్టణంలో ఎటువంటి మార్పులు చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా బాలాజీ చౌక్, లింగంపర్తి రోడ్, యర్రవరం రోడ్, నర్సీపట్నం రోడ్, హనుమాన్ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటున్నాయి. సాయంత్రమైతే ఈ రహదారులపై రాకపోకలు నరకప్రాయంగా మారాయి. మహిళలు ఈ రోడ్లలో రాకపోకలను చాలావరకు తగ్గించారు. రహదారులను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించి వెడల్పు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది.

**నిబంధనలు పాటించాల్సిందే..**

రహదారులను ఆనుకుని ఉన్న ఆక్రమణలకు పూర్తిస్థాయిలో తొలగించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రహదారులను ఆనుకుని ఉన్న ఆక్రమణలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రహదారులు 100 అడుగుల వెడల్పు ఉండాలి. డ్రైన్ల నిర్మాణం నిమిత్తం 80 అడుగులకు కుదించారు. ప్రస్తుతం 70 అడుగు లోపే ఆక్రమణలు తొలగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఒత్తిడులకు లొంగి ఆక్రమణల తొలగింపులో ఆలసత్వం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏలేశ్వరంలో సగం వరకే తొలగించిన ఆక్రమణలు



రహదారిని ఆనుకుని ఉన్న ఆక్రమణలు